andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.9 కనిష్ఠం 26.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 11 జూన్ 2024





ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ (ఫైల్)

ఖానాపూర్, జూన్ 10 : జిల్లాలో గత యాసంగిలో పండించిన వరి ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 228 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించిన సెంటర్ నిర్వాహకులు ధాన్యం మిల్లులకు పంపించారు. ధాన్యం కొనుగోళ్ల ముగిసిన నేపథ్యంలో ఇంకా పూర్తిస్థాయిలో రైతుల ఖాతాలలో డబ్బులను జమ చేసేందుకు ధాన్యం కొనుగోళ్ల తాలూకు వివరాలను ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం డీఆర్డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, జీసీసీల ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సేకరించిన వరి ధాన్యాన్ని ఇప్పటి వరకు 90.11 శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో కొన్నిచోట్ల మిల్లర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపించిన నేపథ్యంలో కొంతమంది రైతులు సంబంధిత మిల్లు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో తరుగు పేరిట మిల్లు యజమానులు సెంటర్ నిర్వా హకులు కలిసి రైతుల నుంచి అదనపు ధాన్యాన్ని తూకం వేశారని పలువురు రైతులు ఆరోపించారు. ఎట్టకేలకు యాసంగి ధాన్యం కొనుగోళ్ల ముగిసిన నేపథ్యంలో ధాన్యం విక్రయించిన రైతులలో ఇప్ప టికే మెజారిటీ రైతులకు డబ్బులు ఖాతాల్లో జమ య్యాయి. ఇంకా డబ్బులు అందని రైతులు వెంటనే ఖాతాలో డబ్బులను జమ చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.



ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు (ఫైల్)

జిల్లా వ్యాప్తంగా 1.58 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం సేకరణ

జిల్లాలో యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం డీఆర్డీఏ ఆధ్వర్యంలో 54, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 92, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 77, జీసీసీ ఆధ్వర్యంలో 5 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మొత్తం జిల్లాలో 228 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 38,113 మంది రైతులు 1,58,071.960 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం విక్రయించారు. ఇందులోంచి 1,57,986.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే మిల్లులకు తరలించగా మరో 85.680 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన వరి ధాన్యాన్ని వెంట వెంటనే ట్యాబ్ ఎంట్రీ నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు 1,42,434.600 మెట్రిక్ టన్నుల ధాన్యం ట్యాబ్ ఎంట్రీ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 15637.360 మెట్రిక్ టన్నుల ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేయాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేసిన ధాన్యం నుండి 90.11 శాతం ధాన్యం ట్యాబ్ ఎంట్రీ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇంకా 8,123 మంది రైతులకు అందని ధాన్యం డబ్బులు

జిల్లాలో 228 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1.58 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. జిల్లా వ్యాప్తంగా 38,113 మంది రైతుల నుండి ధాన్యం సేకరించగా 29,990 మంది రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు రూ. 271.02 కోట్లు జమ చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా 8,123 మంది రైతులకు ధాన్యం తాలూకు డబ్బులు ఖాతాలలో జమ చేయాల్సి ఉందంటున్నారు. ఇప్పటికే 90 శాతానికి పైగా ట్యాబ్ ఎంట్రీ పూర్తయిన నేపథ్యంలో మిగతా 15637.360 మెట్రిక్ టన్నుల ధాన్యం ట్యాబ్ ఎంట్రీ పూర్తయితే రైతులకు పూర్తిస్థాయిలో వారి ఖాతాలో డబ్బులు జమవుతాయని చెబుతున్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి తమ ఖాతాలలో ధాన్యం విక్రయించిన తాలూకు డబ్బులను జమ చేయాలని జిల్లా వ్యాప్తంగా పలువురు రైతులు కోరుతున్నారు.

- 228 కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణ
- 1.58 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 38,113 మంది రైతులు
- 29,990 మంది రైతుల ఖాతాల్లో రూ. 271.02 కోట్ల జమ
- ఇంకా 8,123 మంది రైతుల ఖాతాల్లో జమ కాని ధాన్యం డబ్బులు
- 90 శాతానికి పైగా పూర్తయిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ
- ఇంకా ట్యాబ్ ఎంట్రీ పూర్తికాని 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం


సెల్ఫీ మోజులో..
గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పడి యువకుడి మృతి



సోలంకే పవన్ మృతదేహం

భైంసా, జూన్ 10 : పట్టణంలోని పిప్రి కాలనీలో నివాసముంటున్న సోలంకే పవన్ (18)అనే యువకుడు ఆదివారం రాత్రి సెల్ఫీ మోజులో ప్రమాదవశాత్తు గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీట మునిగి మృత్యువాతపడ్డాడు. సంబంధిత ఘటనపై పట్టణ పోలీసులు, మృతుని కుటుంబీకులు తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సోలంకే పవన్ తన ఇద్దరు మిత్రులు సూర్యవంశీ అవదూత్ (16) శివకార్తి(17)లతో కలిసి ఆదివారం సాయంత్రం గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వెళ్లారు. ప్రాజెక్టు నీటి సమీపంలోని రాళ్లపై కూర్చోని ముగ్గురు మిత్రులు సెల్ఫీలు తీసుకుంటుండగా సోలంకే పవన్, సూర్యవంశీ అవదూత్ చెప్పులు జారి నీటిలో పడిపోయాయి. దీంతో నీట పడిపోయిన చెప్పులను తీసేందుకు గాను సోలంకే పవన్ వంగి యత్నిస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి నీటిలో పడి మునిగి పోసాగాడు. అక్కడే ఉన్న శివకార్తి నీట మునిగిపోతున్న పవన్‌ను కాపాడేందుకు యత్నించి అదుపు తప్పి తాను సైతం నీట పడి మునిగి పోసాగాడు. ఇద్దరు మిత్రులు నీటపడి మునిగిపోతుండటాన్ని గుర్తించిన బయటనున్న సూర్యవంశీ అవదూత్ తమ మిత్రులను కాపాడంటూ కేకలు వేసాడు. ఈ సమయంలో ప్రాజెక్టు సమీపంలో క్రికెట్ ఆడుతున్న యువకులు సూర్యవంశీ అవదూత్ కేకలు విని పరుగున వెళ్లి నీట మునుగుతున్న ఇద్దరు యువకులను కాపాడే చర్యలు చేపట్టారు. అయితే శివకార్తిని కాపాడి బయటకు తీసుకరాగలిగిన యువకులు సోలంకే పవన్ నీట మునిగి గల్లంతై పోవడంతో కాపాడలేకపోయారు. సోమవారం గజ ఈతగాళ్ల సహాయంతో ప్రాజెక్టులో వెతికించగా సోలంకే పవన్ మృతదేహం లభ్యమైంది. మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బూర్గుపల్లి(జి) గ్రామ శివారులో
కుళ్లిపోయిన మృతదేహం గుర్తింపు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

నర్సాపూర్(జి), మే 10 : మండలంలోని బూర్గుపల్లి(జి) గ్రామంలో రోడ్డు నుంచి వందమీటర్ల దూరంలోని కాలువ ప్రాంతంలో సోమవారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం పోలీసులు గుర్తించారు. ఎస్సై మునిగెల హన్మాండ్లు కుళ్లిపోయిన మృతదేహం ఫొటోలు వాట్సాప్‌గ్రూపులో పోస్టు చేయడంతో శవాన్ని గుర్తించడానికి కోతుల్‌గాం గ్రామస్థులు వచ్చి గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భైంసా మండలంలోని కోతుల్‌గాం గ్రామానికి చెందిన బోతేకర్ గంగాధర్(30) తాపీమేస్త్రీగా పని చేస్తూ మహారాష్ట్రలోని అప్పారావ్‌పేట్ గ్రామంలో జీవనం కొనసాగిస్తున్నాడు. మే 31తేదీ రోజు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో తల్లి రంజన్‌బాయి బంధువుల ఇంటిలో, ఇరుగు పొరుగు వారికి వాకబు చేయగా ఆచూకీ లభించపోవడంతో సోమవారం బూర్గుపల్లి(జి) అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన మృతదేహం తన కుమారుడుదేనని గురుపట్టడంతో పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. తన కుమారునికి పెళ్లి కాలేదని సంబంధాలు చూస్తున్న సమయంలో తిరిగిరాని లోకాలకు వెళ్లాడనే రోదనలు మిన్నంటాయి.

డీఆర్డీవో వేధింపులు అరికట్టండి

- కలెక్టర్‌కు సెర్ప్ ఉద్యోగుల సంఘం వినతి

నిర్మల్ కల్చరల్, జూన్ 10 : నిర్మల్ డీఆర్డీవో వేధింపులు అక్రమాలపై తగు చర్య తీసుకోవాలని జిల్లా సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నిర్మల్ మండల సమాఖ్యలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. సమీకృత వ్యవసాయ క్షేత్రం ఆర్థిక లావాదేవీలను బహిర్గతం చేయాలని కోరారు. పాఠశాల విద్యార్థుల ఏకరూప దుస్తులపై తీవ్ర మానసిక ఒత్తిడికి నిర్మల్ ఏపీఎం గంగన్న గుండెపోటుకు గురై మృతి చెందినట్లు పేర్కొన్నారు. అనేక మంది ఉద్యోగులు అదనపు పనులతో అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. సొంత మెప్పు కోసం ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి
స్పృహలేని స్థితిలో లభ్యం



నిర్మల్ కల్చరల్, జూన్ 10 : నిర్మల్ పట్టణ పాత బస్టాండ్ ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తిని స్పృహలేని స్థితిలో పట్టణ పోలీసులు కనుగొన్నారు. అతని వయసు సుమారు 60 పైబడి ఉంటుందన్నారు. 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఫోటోలోని వ్యక్తిని గుర్తించి పట్టణ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇళ్లను కేటాయించాలంటూ
డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారుల ఆందోళన

- ఆర్‌డీవో కార్యాలయం ముట్టడి
- మంజూరీ పత్రాలతో నిరసన



అర్‌డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

భైంసా, జూన్ 10 : ఏడాది క్రితం లక్కీ డ్రా ద్వారా ఎంపికైన తమకు డబుల్ బెడ్రూమ్‌లను అందించాలని డిమాండ్ చేస్తూ భైంసా పట్టణ లబ్ధిదారులు అందోళనలు చేపట్టారు. సోమవారం పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు ఇక్కడి అర్‌డీవో కార్యాలయానికి చేరుకొని అందోళనలకు దిగారు. లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులుగా ఎంపికైన పత్రాలను చూపిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అర్‌డీవో కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు.అనంతరం అర్‌డీవో కార్యాలయంలో సంబంధిత విషయంలో వినతి పత్రం అందచేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు డబుల్ బెడ్రూమ్ లబ్ధిదారులు మాట్లాడుతూ సంవత్సర కాలం నుంచి ఇళ్లు కేటాయించకుండా జాప్యపు విధానాలను అవలంభించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అధికారులు ఇకనైనా కాలయాపన వ్యవహారాన్ని కట్టిపెట్టి తమకు ఇండ్లు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వెల్లడించారు.

'సైబర్‌క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి'

లక్ష్మణచాంద, జూన్ 10 : సైబర్ క్రైం నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సుమలత సోమవారం అన్నారు. మండలంలోని పీచర గ్రామంలో స్థానిక ప్రజలకు సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించారు. మొబైల్‌లో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేయవద్దని, అపరిచితుల మెసేజ్‌లకు రెస్పాండ్ కాకూడదని అన్నారు. ఎవరైనా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

భారీ వర్షాలతో ప్రజలకు
ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క





మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, అదనపు కలెక్టర్

నిర్మల్ టౌన్, జూన్ 10 : భారీ వర్షాలు, వరదల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్, సంబంధితశాఖల అధికారులతో వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై ఆమె రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వర్షాకాలం సమీపించినందున వరదల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లోరినేషన్ చేపట్టిన తర్వాతే ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని, పురాతన ఇళ్లలో నివాసముంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పంపిణీ చేయు ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ఇబ్బందులు ఏర్పడకుండా తీసుకుంటున్న చర్యలు, మిషన్ భగీరథ సర్వే, ఏకరూప దుస్తుల తయారీ వంటి అంశాలపై జిల్లాల వారీగా మంత్రి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ మాట్లాడుతూ... జిల్లాలో భారీ వర్షాలు, వరదల వలన ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని, నిర్ణీత గడువులోగా ఏకరూప దుస్తుల తయారీని పూర్తి చేస్తామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి : కలెక్టర్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జూన్ 10 : ప్రజావాణిలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన క్షేత్రస్థాయిలో పూర్తి చేసి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో పాల్గొని పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్‌లు, తదితర ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవో రత్నకల్యాణి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పునః ప్రారంభమైన ప్రజావాణి

భైంసా, జూన్ 10 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజావాణి పున: ప్రారంభమయ్యింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో సోమవారం నుంచి ప్రజావాణిని ప్రారంభించారు. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 11 నుంచి మూడు నెలల పాటు ప్రజావాణి జరుగలేదు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కోడ్ ఎత్తివేసిన దరిమలా ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అధికారులు ప్రజావాణిని ప్రారంభించారు. భైంసా తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించి ప్రజావాణికి పట్టణ, మండల పరిధిలోని వివిధ ప్రభుత్వల శాఖాధికారులు హజరయ్యారు.ఇక నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి జరుగుతుందని, సమస్యల పరిష్కారం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు.



భైంసాలో ప్రజావాణికి హాజరైన వివిధ ప్రభుత్వ శాఖాధికారులు

సంక్షిప్త సమాచారం

సాయిబాబా ఆలయంలో
నిత్యాన్నదానం

నిర్మల్ కల్చరల్, జూన్ 10 : గండిరామన్న సాయి బాబా ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివాహ దినోత్సవం సందర్భంగా సోమవారం చిన్ని అనిరుద్‌రెడ్డి, అక్షర, పుట్టినరోజు సందర్భంగా మూడారపు రాధా సోమేశ్వర్ అన్న ప్రసాద దాతలుగా వ్యవహరించి అన్నదానం చేశారు. సాయి, శ్రీనివాస్ నిత్యాన్నదానానికి నెలకు 5 వేల రూపాయలు చెలిస్తున్నారు.

దళారులపై చర్య తీసుకోవాలి : సీపీఐ



ధర్నా చేస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 10 : ఖానాపూర్, కడెం మండలాల్లో కొందరు దళారులు, అధికారులు కుమ్మక్కై డబుల్ బెడ్ రూమ్‌లను అమ్ముకున్నారని సీపీఐ ఆరోపించింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. న్యాయబద్ధంగా పేదవారికి ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గణేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

'రైస్‌మిల్లర్లపై చర్య తీసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, జూన్ 10 : రైతులను దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్య తీసుకోవాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌కు ఖానాపూర్ మండలం గోసంపల్లి రైతులు నిర్మల్‌లో ఫిర్యాదు చేశారు. కోత విధించిన రైస్‌మిల్లర్ల నుంచి ధాన్యం రికవరీ చేయాలని కోరారు. ఎంపీఐయూ పార్టీ కార్యదర్శి పీటర్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

'మరణ ధ్రువీకరణ
పత్రం జారీ చేయండి'

నిర్మల్ కల్చరల్, జూన్ 10 : మలేషియా దేశానికి వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన భీమేష్ కుటుంబీకులకు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ నాయకుడు స్వదేశ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో దరఖాస్తు చేశారు. ఫిబ్రవరిలో మల్లేష్ మృతి చెందాడని తెలిపారు. అక్కడ ప్రయత్నిస్తే ఫలితం లభించలేదన్నారు.

విద్యార్థులకు
సౌకర్యాలు కల్పించండి

నిర్మల్ కల్చరల్, జూన్ 6 : బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. వెంకట్ స్వామి సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. యూనిఫామ్, నోట్ పుస్తకాలు, తదితర వాటిని అందజేయాలన్నారు. రంజిత్, పురుషోత్తం, రవీందర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ పోస్టాఫీసులో అర్ధరాత్రి దొంగతనం

● ఏకంగా డిజిటల్ లాకర్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు

ఇచ్చోడ, జూన్, 10: డబ్బులు, విలువైన పత్రాలు, స్టాంపులు, కార్యాలయ దస్త్రాలు నిల్వచేసే లాకర్‌ను ఎత్తుకెళ్లిన ఘటన మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండల కేంద్రంలోని పోస్టాఫీసులో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చొరబడి ఆఫీసులో ఉన్న డిజిటల్ లాకర్‌ను ఎత్తుకెళ్లారు. ఆఫీసులో ఎక్కడ డబ్బులు కనిపించకపోవడంతో ఏకంగా డిజిటల్ లాకర్‌ను ఎత్తుకెళ్లారు. లాకర్‌లో నగదు రూ.6900తో పాటు, విలువైన స్టాంపులు, పోస్టాఫీసు పాసుపుస్తకాలు ఉన్నాయన్నారు. కార్యాలయ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.


వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి : సీపీఐ(ఎంఎల్)

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 10: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మావల మండల పరిధిలోని సర్వే నెం.170లో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలకు పట్టాలతో పాటు పక్క ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం 170లో నివాసం ఉంటున్న పేదలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటనారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించిందన్నారు. ఈ హామీ మేరకు 170లో గుడిసెలు వేసుకొని ఎనిమిది సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదలకు పట్టాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సుభాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్‌శ్రీకర్, దండేకర్ వామన్, గంగమ్మ, తారాబాయి, రఫీక్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాలనీ వాసులు, నాయకులు



నృత్యం చేస్తున్న జిల్లా నృత్యకారులు

సత్తా చాటిన జిల్లా నృత్యకారులు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 10: మంచిర్యాల జిల్లాలో నృత్య సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రస్థాయి నృత్య పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా నుంచి పన్నాల లాస్య బృందంతో పాటు బాల కేంద్రం నుంచి ఆనంద తాండవం, దేవి సుత్తి పాటపై బృందం సభ్యులు నృత్యం చేశారు. మామిడి అక్షయ, అవరగొండ సంజన, అక్షర, అక్షిత ఉపలచివార్, గడ్డం శ్రీనిధి, మోక్ష, క్షీర సాగర్, జాహ్నవి, ఓజస్వినిలు ప్రదర్శన చేశారు. కాగా, కొండ్రా అలేఖ్య జతీ స్వరం, కొంకటి ఇతిక్ష మహిషాసురమర్ధనిపై నృత్య చేశారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసపత్రం అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

'కళల్లో రాణించేందుకు శ్రద్ధ చూపాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 10: చిన్నారులు చదువుతో పాటు ఇష్టమైన కళల్లో రాణించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. మఠంలోని మంథనం ఒక సంకల్పం సాహితి సాంస్కృతిక కళావేదిక ప్రాంగణంలో ఆదివారం రాత్రి జరిగిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో శ్రీయోగానంద సరస్వతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పిల్లలకు విద్యతో పాటు ఇష్టమైన రంగాలలో రాణించేందుకు తమక పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కాగా 40 రోజుల పాటు చిత్రలేఖనం, మట్టి విగ్రహాల తయారీపై మంథనం ఒక సంకల్పం వ్యవస్థాపకులు, కళాకారులు నిశికాంత్ దేశ్‌పాండే శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన 30 మంది చిన్నారులకు మఠాధిపతి ప్రశంస పత్రాలు అందజేశారు. ఇందులో వసంత్‌రావుదేశ్‌పాండే, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్, కళాకారులు సతీష్‌దేశ్‌పాండే, ఎస్. అనిరుద్, చిన్నారుల తల్లిదండ్రులు, తదతరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

గుడిహత్నూర్, జూన్ 10: ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. 8 మంది ఎంపీటీసీలకు గాను నలుగురు హాజరు కాగా, మిగతా వారు గైర్హాజరయ్యారు. పలు శాఖల అధికారులు సైతం గైర్హాజరయ్యారు. హాజరైన పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎక్స్ రోడ్డు జవహర్‌నగర్‌సర్వీస్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదని ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని మండలంలో కరెంట్ సక్రమంగా సరఫరా కావడ లేదని తోషం ఎంపీటీసీ సాగిర్ ఖాన్ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సమావేశం గంటన్నరలో ముగిసింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవితా రెడ్డి, ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌ఫైౖ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్. భాగ్యలక్ష్మీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై గట్టి నిఘా

● ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా ● పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం ● పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 10: పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. బక్రీద్‌ను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ కలెక్టర్ సూచనలు చేశారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాలు పక్కాగా అమలయ్యేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. గోవవ నిషేద చట్టం ప్రకారం గోవదను నిషేధించినందున ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తూ ఎక్కడ కూడా గోవధ జరుగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవానాను నిరోధించేందుకు జిల్లాలోని చెక్‌పోస్టులను వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి,రెవెన్యూ, పోలీసు, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘాఉండేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వివిధ వాహనాలలో పశువులను తరలిస్తే వెంటనే సీజ్‌చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీజ్ చేసిన పశువులకు స్థానికంగానే షెల్టర్ కల్పిస్తూ వాటికి పశుగ్రాసం, నీటి వసతి కల్పించేలా చర్యలు చేపట్టాలని, అంతేకాకుండా ఈ విషయంలో గోశాల నిర్వాహకుల సహకారం తీసుకోవాలన్నారు. పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా, పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయ విక్రయాలు జరిగేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడబడితే అక్కడ పశువులను వదించకుండా కట్టడి చేయాలన్నారు. ఇందులో అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీవో జివాకర్‌రెడ్డి, జి ల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కిషన్, తహసీల్దార్లు పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా, పాల్గొన్న అధికారులు

అంతకుముందు.. ప్లాస్టిక్ బాటిల్స్ వాడకం నిషేదంపై సమావేశం నిర్వహించారు. కార్యాలయాల్లో సమావేశ మందిరాలలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ బాటిల్స్ వాడరాదని ఆదేశించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినట్లు ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినట్లు తెలిపారు. ప్రతీ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేద అజ్ఞలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్‌వోడీలను ఆదేశించారు. అధికారిక కార్యాక్రమాలు, సమావేశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేద ఆజ్ఞలను అమలు చేయాలన్నారు. మండలాలు, గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం

ఉట్నూర్, జూన్ 10: ఉట్నూర్ మండల విద్యావనరుల కేంద్రం నుంచి ప్రభుత్వ పాఠశాలకు పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. మరో రెండు రోజుల్లో పాఠశాలలు పున: ప్రారంభంకానుండడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు పంపించిన పుస్తకాల నుంచి ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్, ఏందా, ఉట్నూర్‌లలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల కోసం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు వచ్చి పుస్తకాలను తీసుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ధరమ్‌సింగ్, రాందాస్, టీర్‌షావ్, దేవదాస్, నరేష్‌లతో పాటు చౌహాన్‌రమేష్, తుమరం మల్కు, దీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భోథ్: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. ఒకటి నుంచి పదవ తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించనున్నట్లు ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. మండలం మొత్తం మీద 4458 మంది విద్యార్థులకు పుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు. అంతేగాక నోట్ బుక్‌లను 6, 7వ తరగతుల వారికి ఒక్కొక్కరికి ఆరు చొప్పున 8వ తరగతికి 9, 10 తరగతులకు ఒక్క విద్యార్థి 14 చొప్పున నోట్ బుక్‌లను అందించనున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలను పునః ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలో చదివి విద్యార్థులకు ప్రైవేట్ బుక్ స్టాల్‌లలో కొనుగోలు చేసి ఇవ్వాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

'బెదిరింపులకు పాల్పడితే చర్యలు'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 10: ఈనెల 6న పట్టణంలోని తిర్పెల్లి వద్ద గల శ్రీనివాస వైన్స్‌లో నలుగురు వ్యక్తులు తల్వార్‌ను చూపించి 'మద్యం ఇవ్వాలని, లేనిపక్షంలో చంపేస్తాం, షాపును ధ్వంసం చేస్తాం' అని బెదిరించిన నలుగురు వ్యక్తుల పై రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఏ1 షేక్ నౌషద్, తిర్పెల్లి, ఏ2 లాలు అలియాస్ అతిఫ్ ఉద్దీన్ ఝురూకి, పంజేష కాలనీ, ఏ3 షేక్ ఇర్ఫాన్, మహాలక్ష్మివాడ, ఏ4 అజ్మత్ ఖురేషి, చోట తలాబ్ (ఫరారీ)లో ఉన్నాడని, ముగ్గురిని సోమవారం రిమాండ్ చేయడం జరిగిందని తెలిపారు. వీరిపై గతంలో కూడా పలు దొంగతనం, బెదిరింపు కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిపై క్రైమ్ నెం.216/2024తో అండర్‌సెక్షన్ 458, 384, 393, 294(బి), 506 ఆర్/డబ్ల్యు 34ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా బెదిరించిన వారిపై నాన్ బెయిలెబుల్ సెక్షన్లను నమోదు చేసి కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వ్యాపారస్థులు పాత నేరస్థులు,రౌడీషీటర్లు డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడిన, ఎటువంటి సమస్యలకైనా పోలీసులను సంప్రదించాలని సూచించారు. నిందితుల వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, బెదిరింపులకు పాల్పడినటువంటి తల్వారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందతులను గుర్తించడంలో, పట్టుకోవడంలో ముఖ్య పాత్ర పోషించిన ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీసు సిబ్బంది రమేష్, నరేష్, క్రాంతిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ రెండవ పట్టణ సీఐ అశోక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

● రాస్తారోకోతో కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు

నేరడిగొండ, జూన్ 10: మండలంలోని రోల్‌మామడ గ్రామ సమీపాన జాతీయ రహదారి 44 పై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కేఎస్‌ఆర్ సంస్థలో పని చేస్తున్న మండలంలోని సంక్రాపూర్ గ్రామానికి చెందిన జాదవ్‌రావు(32) రోడ్డుపై ఉన్న చెట్లకు నీరు పోస్తున్నాడు. ఈ క్రమంలో ట్యాంకర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ప్రమాద స్థలంలోనే జాదవ్‌రావు మృతి చెందాడు. కేఎస్‌ఆర్ సంస్థ నిర్లక్ష్యం వలన జాదవ్ రాజు మృతి చెందాడని కుటుంబీకులతో పాటు గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ధర్నాకు దిగడం వల్ల రోడ్డుకు ఇరువైపులా 3 నుంచి 4కి.మీ.ల మేర వాహనాలు నిలిచి పోయాయి. వెంటనే సంబంధిత కేఎస్‌ఆర్‌సీ అధికారులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20లక్షల పరిహారం అందిస్తామని అనడంతో రాస్తారోకో విరమించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉంది.

గుడుంబా కేసులో మహిళల రిమాండ్

గుడిహత్నూర్, జూన్ 10: గుడుంబా అమ్ముతూ పట్టుబడ్డ ఇద్దరు మహిళలను బైండోవర్ చేసి జరిమానా విధించి ఇద్దరు మహిళలను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫేకర్ అహ్మద్ తెలిపారు. గుడిహత్నూర్ మండలకేంద్రానికి చెందిన జాదవ్ విమల, బక్వాడ్ లక్ష్మీలు గుడుంబా అమ్ముతూ పలుమార్లు పట్టుబడినప్పుడు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందని, లక్ష రూపాయల జరిమానా విధించినప్పటికీ.. సకాలంలో చెల్లించకపోవడంతో సోమవారం ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని జిల్లాకేంద్రంలోని జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది కార్తీక్, మహ్మద్, అరుణ, మంజుల, మయూరి ఉన్నారు.

మహిళ అదృశ్యం

బోథ్, జూన్ 10: మండల కేంద్రానికి చెందిన కొత్త కాలనీలో నివసిస్తున్న మాల్వే చంద్రకళ అనే ఓ మహిళ(42) ఆదివారం అదృశ్యమైంది. తప్పిపోయిన మహిళ భర్త పొలం పనులకు వెళ్లగా ఇంట్లోనే ఉందని, సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో లేదని, బంధువులకు సమాచారం ఇచ్చారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఎస్ఐ బి.రాము తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'


ఆదిలాబాద్ అర్బన్, జూన్ 10: ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్‌లో సొసైటీకి సంబంధించిన 8ప్లాట్లలో 2ప్లాట్లని తప్పుడు ధృవపత్రాలతో కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శేఖర్ కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్న వించారు.

ఎద్దులబండితో బడిబాట కార్యక్రమం

కుంటాల, జూన్; 10: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో వినూత్న రీతిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ఎల్లన్న ఆధ్వర్యంలో గ్రామంలో ఎడ్లబండిపై వాడవాడలా తిరుగుతూ తమ పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఎడ్లబండిపై తిరుగుతూ బడిఈడు పిల్లలందరికి బడికి పంపించాలని తల్లిదండ్రులకు చెప్పుకుంటూ బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

స్కాన్ చేయండి.. నమోదు చేసుకోండి

● ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రిజిస్ట్రేషన్ సులభతరం



భైంసా ఏరియా ఆసుపత్రి ఓపీ విభాగం వద్ద స్కాన్ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

భైంసా, జూన్ 10 ; ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాలు మెరుగుపడటం, వివిధ రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో రోజు రోజుకు చికిత్సకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో ఓపీ నమోదు కోసమే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిత్యం సుమారుగా 350 నుంచి 450 మంది వరకు ఓపీ వైద్య సేవల కోసం వస్తుంటారు.ఇక నిర్మల్ ఆసుపత్రిలో నిత్యం సుమారు 500 నుంచి 600 వరకు ఉంటుంది. ఈ రెండు ఆసుపత్రులలో ఓపీ నమోదుకు ప్రత్యేకంగా రెండు కౌంట్లను ఏర్పాటు చేసినా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఓపీ నమోదు కాగితం ఇచ్చేందుకు సమయం ఎక్కువగా పడుతుంది. దీంతో రోగులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటనీ అధిగమించి కేవలం ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా ఎవరికి వారుగా ఓపీ నమోదు చేసుకునేలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది.

● యాప్ డౌన్‌లోడ్ ఇలా..

అండ్రాయిడ్ ఫోన్‌లోని ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఎ.బి.హెచ్.ఎ (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఇన్‌స్టాల్ కాగానే ఆసుపత్రిలో ఓపీ నమోదుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. అందులో పేర్కొన్న కాలమ్‌లో ఫోన్ నంబర్ లేదా ఆధార్ నంబర్ టైప్ చేసి సబ్మిట్ చేయాలి. వెంటనే ఈ వివరాలన్నీ ఆసుపత్రిలోనీ ఓపీ నమోదు కేంద్రం సాఫ్ట్‌వేర్‌లోకి వెళ్తాయి. కొద్ది క్షణాల్లో ఒక టోకెన్ నంబర్ మీ ఫోన్‌కి వస్తుంది. ఈ నంబర్‌ను ఓపీ నమోదు కౌంటర్‌లో చూపించగానే ఓపీ చిట్టీ డౌన్‌లోడ్ చేసి ఇస్తారు.



భైంసా ఏరియా ఆసుపత్రిలో ఓపీ విభాగం వద్ద రద్దీ

అవగాహన కలిగించేందుకు చర్యలు

● డా. కాశీనాథ్,(సూపరిండెంట్, ఏరియా ఆసుపత్రి, భైంసా)

ఆన్‌లైన్ ద్వారా ఓపీ నమోదు చేసుకోవడంపై అవగాహన పెంచడానికి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాం. ఫోన్ వినియోగించే వారిని క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ విధానంతో రద్దీ భారీగా తగ్గనుంది.సకాలంలో ఓపీ సేవలు పొందేందుకు వీలుంటుంది.

గ్రామ పంచాయతీ బోర్ వెల్‌ను

ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

● ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఎక్బాల్‌పూర్ గ్రామస్థులు



ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్ వినతిపత్రం అందజేస్తున్న ఎక్బాల్‌పూర్ గ్రామస్థులు

ఖానాపూర్, జూన్ 10 : తమ గ్రామ పంచాయతీ బోర్‌వెల్‌ను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్బాల్‌పూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజల అవసరాల కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్ వెల్‌కు ఉన్న చేతి పంపును ధ్వంసం చేసి ఇద్దరు వ్యక్తులు ప్రైవేట్‌గా మోటార్ బిగించుకొని తమ సొంత ఇంటి అవసరాల కోసం వాడుకుంటున్నారన్నారు. ఇదేమని అడిగిన గ్రామస్థుల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ మహిళతో ఇష్టారీతిన మాట్లాడిస్తున్నారన్నారు. ప్రస్తుతం గ్రామంలో తీవ్రంగా నీటి ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ చేతి పంపులను ధ్వంసం చేసి విద్యుత్‌మోటార్‌ను అమర్చుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని గ్రామస్థులకు బోర్‌వెల్ ఉపయోగపడేలా చూడాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు జేవింద్, నరేష్, మోహన్ తదితరులున్నారు.

'అ'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముథోల్, జూన్ 10 : మండలంలోని ఆష్ట గ్రామంలో 2010-2011 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 13 సంవత్సరాల తరువాత ఒకచోట కలుసుకొని సందడి చేశారు. స్నేహితులు ఒకరికొకరు ఆప్యా యంగా పలకరించుకొని క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

భైంసా, జూన్ 10 : పట్టణ పరిధిలోని ఎన్‌బీ కాలనీ పరిధిలో ఆదివారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకు చెందిన వినయ్‌కుమార్ ఇంటికి తాళం వేసి తన కుటుంబీకులతో కలిసి ఊరికి వెళ్లాడు. ఇది గుర్తించిన దొంగలు రాత్రి వేళలో ఇంటికి వేసిన తాళం పగుల కొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాను పగులకొట్టి అందులోని రూ.15 వేల నగదుతో పాటు మూడు తులాల బంగారు, 20 తులాల వెండి అభరణాలు అపహరించుకపోయారని బాధిత కుటుంబీకులు తెలిపారు. బాధిత ఇంటి యజమాని వినయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ద్వారా చోరి జరిగిన ఇంట్లో వేలి ముద్రల ఆధారాలను సేకరించారు.

ప్రారంభమైన ప్రజాఫిర్యాదుల స్వీకరణ



కుంటాలలో ప్రజాఫిర్యాదుల కార్యక్రమం

కుంటాల, జూన్, 10 : గత మూడు నెలల నుంచి ఎన్నికల నియమావళి దృష్ట్యా నిలిచిన ప్రజా ఫిర్యాదుల విభాగం నియమా వళి ముగియడంతో సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి పలు సమస్యలతో కూడిన ఫిర్యాదులను అధికారులకు అందజేశారు.



ఉద్యమ నేతలకు.. కష్టకాలం!

- జిల్లాలో ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైన సోయం బాపురావు, ఆత్రం సక్కు
- ప్రశ్నార్థకంగా మారిన ఇద్దరు నేతల రాజకీయ భవిష్యత్తు
- లోక్‌సభ ఎన్నికల్లో ఒకరి ఓటమి.. మరొకరు సైలెంట్
- మళ్లీ ఆదివాసీల ఉద్యమంవైపు అడుగులు వేసేందుకు ప్రయత్నాలు





ఆదిలాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివాసీల ఉద్యమం పేరు చెబితేనే సోయం బాపురావు, ఆత్రం సక్కుల పేర్లు ప్రధానంగా వినిపిస్తాయి. ఒక్కప్పుడు ఆదివాసీల ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ఈ ఇద్దరు నేతలకు.. ప్రస్తుతం కష్ట కాలమే కనిపిస్తోంది. గత ఐదారేళ్ల క్రితం ఆదివాసీలు చేసిన పోరాటాలతో రాష్ట్ర ప్రభుత్వమే దిగిరావాల్సి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఆదివాసీల ఉద్యమంపై స్వయంగా ముఖ్యమంత్రి స్పందించిన దాఖలాలు ఉన్నాయి. అయితే ఉద్యమానికి నాయకత్వం వహించిన మాజీ ఎంపీ సోయం బాపురావు 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. అలాగే ఆత్రం సక్కు కూడా ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో సోయం, సక్కులపై ఆదివాసీలు భారీ ఆశలు పెట్టుకున్నారు. చట్టసభల్లో ఆదివాసీల గళం వినిపించే అవకాశం దక్కిందని ఎంతో సంబరపడ్డారు. కానీ గడిచిన ఐదేళ్లలోనే అంచనాలు తారుమారై ఈ ఇద్దరు నేతలు ప్రత్యక్ష రాజకీయాలకు దూరం కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గతంలో గెలుపొందిన తర్వాత రాజకీయాల్లో కీలకంగా మారిన నేతలకు చట్టపరమైన ఇబ్బందులు ఎదురుకావడం.. ఆదివాసీల ఉద్యమాన్ని కొంత మేరకు పక్కన పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ఐదేళ్లుగా జిల్లాలో పెద్దగా ఆదివాసీ ఉద్యమ కార్యక్రమాలను కూడా పెద్దగా చేపట్టినట్లు కనిపించడం లేదు. ఎన్నో ఏళ్లుగా హక్కుల కోసం పోరాటం చేస్తు వస్తున్న ఏఒక్క హామీ నెరవేరక పోవడంతో ఆదివాసీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. ఇటు పార్టీ ఆదేశాలు, అటు ఉద్యమకారుల నుంచి ఒత్తిళ్లు పెరుగడంతో సోయం గతంలోనే తుడందెబ్బ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆత్రం సక్కు అధికార పార్టీలో కొనసాగడంతో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. దీంతో అప్పటి నుంచి ఆదివాసీల ఉద్యమానికి నాయకత్వమే లేకుండా పోయిందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ ఇద్దరు నేతలు మళ్లీ ఉద్యమం వైపు అడుగులు వేసే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది.

ఊహించని షాక్

గత ఎన్నికల్లో ఉద్యమ అండతో గెలిచిన ఈ ఇద్దరు నేతలకు.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికల్లోనూ వారికి ఊహించని షాక్ తగిలింది. దీంతో ప్రత్యక్ష రాజకీయాలకు సోయం బాపురావు, ఆత్రం సక్కులు ఇద్దరూ పూర్తిగా దూరమయ్యారు. దీంతో వీరిద్దరి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అయితే మాజీ ఎంపీ సోయం బాపురావుకు బీజేపీ అవకాశం ఇవ్వకుండా పక్కన పెట్టడం, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బీఆర్ఎస్ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినా.. కనీస స్థాయిలో ఆదివాసీల మద్దతు దక్కలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోసారి గెలవడం ఖాయమని భావించిన సోయం బాపురావు, ఆత్రం సక్కుల అంచనాలు తారుమారయ్యాయి. ఒకప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనాలకు కారణమైన ఈ ఇద్దరు నేతలు.. ప్రస్తుతం పూర్తిగా సైలెంట్ అయిపోయారు. రాజకీయ పరమైన పదవులకు దూరం కావడంతో ప్రజల్లో మరింత ప్రాధాన్యత తగ్గుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆత్రం సక్కు పోటీ చేసినా.. ఓటమి పాలై అధికారానికి దూరం కావడం, సోయం బాపురావు అసెంబ్లీ ఎన్నికల్లోనే గెలువక పోవడం అయినా.. మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో అవకాశం దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉద్యమ నేతలకు పార్టీలు, ప్రజలు అండగా నిలుస్తారని అందరూ భావించినా.. అది సాధ్యం కాకపోవడంతో అసలు రాజకీయ భవిష్యత్తే కనిపించడం లేదంటున్నారు. మరో ఐదేళ్ల పాటు వేచిచూడక తప్పదంటున్నారు. ఒక్కప్పుడు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కీలకంగా మారిన నేతలు.. ప్రస్తుతం ఇంటికే పరిమితం కావడంపై చర్చనీయాంశంగా మారింది.

తగ్గిన ప్రాధాన్యత

ఉద్యమ నేతలకు ఆదివాసీల్లో ప్రాధాన్యత తగ్గడంపై పలురకాల చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో గెలిచిన ఈ ఇద్దరు నేతలు ఆదివాసీల సమస్యలను పట్టించుకోలేదన్న ఆరోపణలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. సోయం ఎంపీగా గెలిచిన తర్వాత పరిమితులకు మించి మాట్లాడే అవకాశమే లేకుండా పోయింది. క్రమశిక్షణ పేరిట పార్టీ అధిష్ఠానం అభ్యంతరాలు చెప్పడంతో ఆయన సైలెంటై పోయారు. ఎంపీగా కొనసాగుతునే అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచే ప్రజల్లో ఆయనకు ప్రాధాన్యత తగ్గుతూ వచ్చిందనే చెప్పవచ్చు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటించిన సందర్భంలోనూ మాజీ ఎంపీ సోయం బాపురావుకు అంతగా ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించ లేదు. దీంతో ఆయనను పార్టీ పక్కన పెట్టిందనే ప్రచారం కూడా జోరుగా సాగింది. అనుకున్నట్లుగానే లోక్‌సభ ఎన్నికల్లో అవకాశం దక్కకుండా పోయింది. అప్పటి నుంచి ఆయన తీవ్ర అసంతృప్తికి గురై పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సైలెంటై పోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని ఆత్రం సక్కుకు లోక్‌సభ ఎన్నికల్లో అవకాశం దక్కినా.. అసలు గెలిచే అవకాశమే లేకుండా పోయింది. పార్టీ అధికారంలో లేకపోవడం, ఆదివాసీలు అండగానిలవక పోవడంతో ఆయన ఓటమి పాలయ్యారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా ఆదివాసీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయలేదన్న అపవాదులు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు మెజార్టీ ఆదివాసీల మద్దతు తమకే ఉందని చెప్పుకున్న ఈ ఇద్దరు నేతలు.. ఎన్నికల ఫలితాల తర్వాత ఆశ్చర్యానికి గురికావాల్సి వచ్చింది. సొంత సామాజికవర్గం అండగా నిలవక పోవడం, నమ్ముకున్న పార్టీ నట్టేటా ముంచడంతో ఉద్యమ నేతల రాజకీయ భవిష్యత్తు పూర్తిగా డైలామాలో పడిందంటున్నారు.

సంక్షిప్త సమాచారం



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్రశాంతంగా ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 10: ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో భాషా పండితులు, వ్యాయామ ఉపాధాయులు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఈ ప్రక్రియను డీఈవో ప్రణీత స్వయంగా పర్యవేక్షించారు. జిల్లాలో భాషా పండితులు 220 మంది, వ్యాయామ ఉపాధ్యాయులు 25 మంది అప్‌గ్రేడ్ అయ్యారు. మరోవైపు 25 ఏళ్ల తర్వాత ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు లభించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో 83 సీట్ల ఖాళీలు

బోథ్, జూన్ 2: బోథ్ మండల కేంద్రంలోని బీసీ బాలుర కళాశాలలో 83 సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటికి దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ చిన్నయ్య కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నెం.960601162, 9346408238 ద్వారా సంప్రదించాలని తెలిపారు. అలాగే కౌటా(బి) గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలో మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు 45 నుంచి పదవ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు 45 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు పైన ఉన్న ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

డీఎడ్ దరఖాస్తుల గడువు పొడగింపు : ప్రిన్సిపాల్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 10: డీఎడ్‌లో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును పొడగించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష జూలై 10న ఆన్‌లైన్‌లో ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాణావత్ ప్రశాంత్

నేరడిగొండ, జూన్ 10: రాష్ట్ర జూనియర్ అటవీ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన బాణావత్ ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో జరిగిన ఎన్నికల్లో బాణావత్ ప్రశాంత్‌ను రాష్ట్రకార్యవర్గ సభ్యులు సంఘం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించారు. ప్రశాంత్ ఆదిలాబాద్ బీట్ అధికారిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

త్వరితగతిన చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త
- మూడు నెలల తర్వాత ప్రారంభమైన 'గిరిజన దర్బార్'
- తరలివచ్చిన ఆదివాసీలు



ఆదివాసీ గిరిజనుల సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో



వినతిపత్రం అందజేస్తున్న 4వ తరగతి ఉద్యోగుల సంఘ నాయకులు

ఉట్నూర్, జూన్ 10: మూడు నెలల తర్వాత ప్రారంభమైన గిరిజన దర్బార్‌కు స్పందన లభించింది. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రధాన కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌కు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు తమ సమస్యలను వివరించడంతో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త వారి సమస్యలను ఓపికగా వింటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఐటీడీఏ గిరిజన దర్బార్‌కు వస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అధికారులను ఆదేశించారు. ఉట్నూర్ ఐటీడీఏలో గిరిజన దర్బార్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను పీవో స్వీకరించారు. ఉట్నూర్ మండల లక్కారం గ్రామానికి చెందిన గంగాదేవి తనకి ఏదైనా ఉపాధి కల్పించమని, నేరడిగొండ మండలం నాగమలార్డ్ గ్రామానికి చెందిన ఆత్రం జంగుబాయి తనికి అటవి హక్కు పత్రం ఇప్పించమని, పెంబి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పద్మ తనకి గురుకుల పాఠశాల అడ్మిషన్స్ కావాలని, ఉట్నూర్ మండలం హనుమాన్ నగర్‌కి చెందిన నితిన్ తనకి ఆర్థిక సహాయం కావాలని కోరారు. పింఛన్, రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ గిరిజన దర్బార్‌లో అదనపు వైద్యాధికారి డాక్టర్ కుడిమెత మనోహర్, ఆర్‌సీవో గంగాధర్, పరిపాలన అధికారి సున్నం రాంబాబు, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, తదితరులు పాల్గొన్నారు.

● వేతనాల పెంపుదలకు పీవో అంగీకారం

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న దినసరి ఉద్యోగులకు వేతనాలు పెంచాలని కోరడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అంగీకరించారని గిరిజన సంక్షేమ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారిని కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. దినసరి ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బంది వేతనాలు పెంచాలని కోరడంతో జిల్లా కలెక్టర్‌కు నివేదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈమేరకు పీవో స్పష్టం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు కేబీసీ నారాయణ, జిల్లా అధ్యక్షులు సౌకత్ హస్సేన్, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కమలరంభ, సోనేరావు, ఎం.మల్లేష్, కనక విఠల్, బాపురావ్, పెందోర్ భరత్, కుంర చందు, సమ్మయ్య, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 10: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సూచించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 62 అర్జీలను స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రజావాణి ప్రారంభమైన నేపథ్యంలో అర్జీదారులు బారులు తీరారు. విద్యా, వైద్యం, వ్యవసాయ, పింఛన్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ రాజార్షి షా



ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తూ..

వసతి గృహాల వివరాలు విడుదల

ఆదిలాబాద్ రూరల్: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్న వసతి గృహాల వివరాలను తెలిపే కర పత్రాలను జిల్లా కలెకర్ రాజార్షిషా సోమవారం వాటికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వసతి గృహాల్లో ఉచిత భోజనం, చదువుకోవడానికి అవసరమైన ప్రతీది ఉచితంగా అందజేస్తారని అన్నారు. మూడో తరగతి నుంచి పదో తరగతి, ఆపై తరగతి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని వసతి గృహాల్లో చేర్పించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత ఈడీ శంకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎంపీ, ఎమ్మెల్యే

కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్/బోథ్, జూన్ 10: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌లను ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయలశంకర్‌లు కలిసి అభినందనలు తెలిపారు. ఢిల్లీలో సోమవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, ముస్తాపూర్ అశోక్, డా॥శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

సోనాల, జూన్ 10: సోనాల గ్రామంలోని రాజరాజేశ్వర శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం గ్రామ ప్రజలు నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని వరద పాషాన్ని నైవేద్యంగా సమర్పించారు. అంతేకాకుండా మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఈర్ల నడిపెన్న, కొండ ముత్తన్న, వసంత్‌రావ్, జైతురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భాశెట్టి రమేష్, గాజుల భూమారెడ్డి, మురళీ, గంగారెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

● మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 10: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల చిన్నన్న అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వేతనాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా లింగాల చిన్నన్న మాట్లాడుతూ ప్రభుత్వం డబ్బులు ఇవ్వకున్న అప్పులు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులు రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారని తెలిపారు. అయిన వారికి ఇచ్చే గౌరవ వేతనం రూ.2వేలు నెలనెలా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలతో పాటు వసతిగృహాల మాదిరిగా నిత్యావసర సరుకులను ప్రభుత్వమే మధ్యాహ్న భోజనానికి అందించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆందోళనలు చేపడుతా మని స్పష్టం చేశారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు మేస్రం కిషన్, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, తులసి, సహాయ కార్యదర్శి నర్సమ్మ, గంగామణి, సహేర, నహేదా, సక్కుబాయి, నర్మద, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

చదువుతోనే గిరిజన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు : ఎంపీడీవో

తలమడుగు, జూన్ 10: చదువుతోనే గిరిజన విద్యార్థులకు ఉద్యోగుల భవిష్యత్తు లభిస్తుందని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సోమవారం మండలంలోని టోకి కూడా, షేకుకూడ, షేర్ కూడా తదితర గిరిజన పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 12 నుంచి పాఠశాలలో ప్రారంభమవుతున్నాయని, విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఉచిత భోజనం ఉచిత వస్తువులు, ఇతర మూలిక వసతులు కల్పిస్తుందని అన్నారు. అదే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇందులో సీసీ ఆర్పీ గేయడం ఆనందరావు, షేక్‌కూడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు, నారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి : టీఎస్ యూటీఎఫ్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 10: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని, సత్వరమే బదిలీల ప్రక్రియను చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, జిల్లా కార్యదర్శి ఆత్రం ఇస్తారి రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం విషయంపై స్పందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు షెడ్యూల్ ప్రకటించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



బోథ్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్, ఏపీవోలు

ప్రారంభమైన భగీరథ ఇంటింటా సర్వే

ఇచ్చోడ, జూన్ 10: ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా కావడం లేదన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ ఇంటింటా సర్వే నిర్వహించాలని నిర్ణయించడంతో సోమవారం మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామంలో ఎంపీడీవో లక్ష్మణ్ ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి భగీరథ నీరు వస్తుందా? లేక కొన్ని ఇళ్లకు నల్లాలు బిగించకపోవడం, ఇంటిదాకా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టకపోవడం, పాత పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తుండటం వంటి తదితర వాటిపై దృష్టిసారించి నివేదికలు రూపొందించి ప్రతీ ఇంటికి నీరు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించడం వల్ల ఎవరికి తాగునీరు అందుతుందో? గ్రామంలో నీరు రానివారికి నల్లాలు ఏర్పాటు చేయాల్సిన వాటిపై సర్వే కొనసాగుతుందని ఆయన తెలిపారు.



కొకస్‌మన్నూర్‌లో వివరాలు అడుగుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

భోథ్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ప్రారంభమైంది. గత రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ మిషన్ భగీరథ పథకాన్ని పరిశీలించాలని ఆదేశించారు.